క్లుప్తంగా

వెండి మకరతోరణం బహూకరణ



పొదలకూరు: పట్టణంలోని కన్యకా పరమేశ్వరి అమ్మవారికి వ్యాపారవేత్త తన్నీరు మోహన్‌రావు జ్ఞాపకార్థం ఆయన సతీమణి శ్రీవల్లీ, కుమార్తెలు, అల్లుళ్లు కలిసి రూ.15 లక్షల విలువైన వెండి మకరతోరణాన్ని బహూకరించారు. శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా మంగళవారం దేవస్థానం కమిటీకి దీనిని అందజేశారు. ఈ సందర్భంగా దేవస్థానం కమిటీ బాధ్యులు ప్రత్యేకపూజలు నిర్వహించి దాతలకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వీరాంజనేయునికి విశేష పూజలు



ప్రత్యేకాలంకరణలో అభయాంజనేయస్వామి

పొదలకూరు: పట్టణంలోని మారుతీనగర్‌లో కొలువైన అభయాంజనేయ స్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం దేవస్థానంలో అభిషేకాలు, ఆకు పూజ, అష్టోత్తర పూజలు చేశారు. సాయంత్రం స్వామివారికి ప్రత్యేక పూజలు జరిగాయి.

వైభవంగా వార్షికోత్సవం



పొదలకూరు: పట్టణంలోని పోలేరమ్మ తల్లి దేవస్థానం వార్షికోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. దేవస్థానం నిర్మాణదాత పూకోటి లక్ష్మీనారాయణ దంపతులు ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమంలో పాల్గొన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాలను అందజేశారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ట్రెక్కింగ్‌కు కొత్తూరు విద్యార్థి ఎంపిక



ఇందుకూరుపేట: మండలంలోని కొత్తూరు చెందిన జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి దేవర కార్తీక్ అరకు వ్యాలీలో జరుగనున్న ట్రెక్కింగ్‌కు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం వి.మల్లికార్జున తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థిని ఎన్‌సీసీ ఏఎన్‌ఓ అరోరా, ఉపాధ్యాయులు, సిబ్బంది మంగళవారం అభినందించి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

వ్యర్థాలు తొలగించేందుకు చర్యలు

- కమిషనర్ వైఓ నందన్

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని డ్రెయిన్లలో వ్యర్థాలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ వైఓ నందన్ సూచించారు. మంగళవారం 29వ డివిజన్ మహాత్మా గాంధీ నగర్ ప్రాంతంలో ఆయన పర్యటించారు. పారిశుద్ధ్య నిర్వహణ ఆశించిన స్థాయిలో లేదని కమిషనర్ శానిటేషన్ విభాగం సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నూతన భవనాల కొలతలను తనిఖీ చేసి అసెస్మెంట్ డిమాండ్లను పరిశీలించారు. అనంతరం కొండ్లపూడి ప్రాంతంలోని టిడ్కో గృహాల ప్రాంగణం, హౌసింగ్ లేఅవుట్ ప్రాంతాలను నందన్ పరిశీలించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ షేక్ సత్తార్, ఎస్‌ఈ రామ్మోహన్‌రావు, టౌన్ ప్లానింగ్, శానిటేషన్, ఇంజినీరింగ్ విభాగం అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

➡ స్వచ్ఛాంధ్ర – స్వచ్ఛ నెల్లూరును తీర్చిదిద్దాలంటే అందరూ చెత్తను వేరుచేసి మున్సిపల్ శానిటేషన్ సిబ్బందికి అందించాలని కమిషనర్ నందన్ అన్నారు. మంగళవారం నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో కార్పొరేషన్, బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ వార్డు శానిటేషన్, ఎన్విరాన్మెంట్ సెక్రటరీలు, ఎమినిటీస్ సెక్రటరీలు, శానిటరీ మేస్త్రీలకు ఒకరోజు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణా తరగతులను నిర్వహించారు. ఏడబ్ల్యూఐఎల్‌ఎస్‌జీ నుంచి రాజేష్, సాయికృష్ణ, పీఎంయూ టీం పాల్గొన్నారు. ఆర్పీలుగా డాక్టర్ శ్రీనివాస్, రమాదేవి వ్యవహరించారు.

జగన్మాతా.. నమోస్తుతే

- వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

పొదలకూరు: శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా పట్టణంలో కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో మంగళవారం అమ్మవారు రాజరాజేశ్వరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అభిషేకాలు, ప్రత్యేక పూజలు, లలితా సహస్రనామార్చన, త్రిశతి, సాయంత్రం ఖడ్గమాల పూజలు నిర్వహించారు.

శివాలయంలో..

పట్టణంలో కామాక్షి సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. నవరాత్రులు పూర్తయ్యేంత వరకు అమ్మవారికి తెల్లవారుజామున 5.30 గంటలకు ప్రత్యేక అభిషేకాలను నిర్వహిస్తున్నారు. రామలింగేశ్వరస్వామికి రుద్రాభిషేకం జరిపించారు.

మరుపూరులో..

మండలంలోని మరుపూరులో ఉన్న కామాక్షి సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో గాయత్రీ అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా యశ్వంత్‌రెడ్డి దంపతులు వ్యవహరించారు.

ఆదిలక్ష్మి అలంకారంలో..

పట్టణంలోని శ్రీలక్ష్మీగోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా అమ్మవారు ఆదిలక్ష్మి అలంకారంలో దర్శనమిచ్చారు. ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కాంతమ్మతల్లి ఆశ్రమంలో..

ఇనుకుర్తి కాంతమ్మ తల్లి ఆశ్రమంలో అమ్మవారు బాలాత్రిపుర సుందరి అలంకారంలో దర్శనమిచ్చారు. తెల్లవారుజామున ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆశ్రమ పీఠాధిపతి సుబ్బారెడ్డిస్వామి భక్తుల ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పోలేరమ్మ ఆలయంలో..

మనుబోలు: శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మనుబోలు కోదండరామపురంలోని పోలేరమ్మ ఆలయంలో అమ్మవారు మంగళవారం గాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకుడు శ్రీనివాసులు అమ్మవారికి గాయత్రీదేవి అలంకారం చేసి శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకం, మహిళలతో సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉభయకర్తలుగా నీలిశెట్టి విజయ్‌కుమార్– సుమతి దంపతులు వ్యవహరించారు.



మనుబోలు: గాయత్రీదేవి అలంకారంలో..

- **బుచ్చిరెడ్డిపాళెం రూరల్:** దేవీ నవరాత్రుల సందర్భంగా మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయంలో మంగళవారం అమ్మవారు త్రిపురాంబికాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు పుణ్యాహవచనం, కలశపూజలు, సాయంత్రం సామూహిక కుంకుమార్చన, మహా నవావరణపూజ నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఏర్పాట్లను ఈఓ శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.



పొదలకూరు: మరుపూరులో గాయత్రీదేవి అలంకారంలో అమ్మవారు



పొదలకూరు: సామూహిక కుంకుమ పూజలు నిర్వహిస్తున్న మహిళలు



పొదలకూరు: వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదిలక్ష్మి అలంకారం

ఆక్రమిత స్థలంలో హెచ్చరిక బోర్డు

తోటపల్లిగూడూరు: మండలంలోని ఈదూరు గ్రామ రెవెన్యూ పరిధిలో ఆక్రమణకు గురైన పులిమిట్ట దొరువు స్థలంలో అధికారులు హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. గ్రామంలోని సర్వే నంబర్ 1232లో 66 సెంట్ల ప్రభుత్వ దొరువు ఉంది. స్థానికంగా పొలాలు ఉన్న ఓ వ్యక్తి గత కొంత కాలంగా ఆ దొరువును ఆక్రమించుకొని తన పొలంలో కలిపేసుకున్నాడు. ఈ క్రమంలో ఆయన చేతిలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని పోలవరపు కార్తీకేయ మండలాధికారులకు అర్జీ సమర్పించారు. ఈ నేపథ్యంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సంబంధిత పులిమిట్ట దొరువును పరిశీలించి దొరువు ఆక్రమణకు గురైందని నిర్ధారించారు. వెంటనే సంబంధిత స్థలంలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. అయితే ఆక్రమిత పులిమిట్ట దొరువును సర్వే చేసి నాలుగు వైపుల హద్దులు చూపాలని అర్జీదారుడు అధికారులను కోరుతున్నారు.



వైఎస్సార్‌సీపీ మద్దతుదారులపై కక్ష సాధింపు

- తాళం వేసిన ఇంటిని ఆక్రమించి మరొకరికి విక్రయం
- న్యాయం చేయాలంటూ బాధితుల ఆవేదన

తోటపల్లిగూడూరు: గత అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతు పలికారని ఓ కుటుంబంపై టీడీపీ నేతలు పగపట్టారు. ఈ క్రమంలో వారు గ్రామంలో లేని సమయంలో ఇంటిని ఆక్రమించుకుని మరొకరికి విక్రయించిన ఘటన తోటపల్లిగూడూరు మండలం వెంకటేశ్వరపట్టుపుపాళెంలో ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని కోడూరు పంచాయతీ వెంకటేశ్వర పట్టపుపాళెం గ్రామానికి చెందిన కోడూరు బుజ్జమ్మ– ఖాదర్‌బాషా దంపతులు వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు. గత అసెంబ్లీ ఎన్నికల్లో వీరు వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో స్థానిక టీడీపీ నేతలు వీరిపై పగబట్టారు. ఎలాగైనా వీరిని ఇబ్బందులకు గురి చేయాలని ప్రయత్నాలు ప్రారంభించారు. ఖాదర్‌బాషా కుటుంబం గ్రామంలో 1005, 1006 సర్వే నంబర్‌లో 2017లో పక్కా గృహాన్ని నిర్మించుకున్నారు. 12 అంకణాల్లో నిర్మించుకున్న ఆ ఇంటి విలువ ప్రస్తుతం రూ.40 లక్షలు ఉంటుంది. అయితే ఎన్నికల తర్వాత పిల్లల చదువుల నిమిత్తం వారు ఇంటికి తాళం వేసి నెల్లూరులో ఉంటున్నారు. దీంతో స్థానిక టీడీపీ నేతల కన్ను తాళం వేసిన వారి ఇంటిపై పడింది. వెంటనే టీడీపీ నేతలు ఆ ఇంటిని ఆక్రమించుకుని దౌర్జన్యంగా మరొకరికి ధారాదత్తం చేసేశారు.



వెంకటేశ్వర పట్టపుపాళెంలో టీడీపీ నేతలు ఆక్రమించుకుని విక్రయించిన నివాసం

పోలీసుల నామమాత్రపు కేసులు

దీని గురించి ఆలస్యంగా తెలుసుకున్న బాధితులు తమకు అన్యాయం జరిగిందని, న్యాయం చేయాలంటూ పోలీసులను ఆశ్రయించారు. అయితే అధికార పార్టీకి దాసోహమైన తోటపల్లిగూడూరు పోలీసులు బాధితుల ఇంటిని ఆక్రమించి, విక్రయించిన కేసులో ఐదుగురు నిందితులపై నామమాత్రపు కేసులు కట్టి చేతులు దులుపుకున్నారు. దీంతో చేసేదేమి బాధితులు కలెక్టర్‌ను కలిసి తమకు జరిగిన అన్యాయాన్ని వివరించి న్యాయం చేయాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబసభ్యులు మంగళవారం మాట్లాడుతూ కేవలం వైఎస్సార్‌సీపీకి అండగా నిలిచామనే కారణంగా టీడీపీ నేతలు తమపై పగబట్టారన్నారు. తాము గ్రామంలోకి వస్తే చంపేస్తామని బెదిరిస్తున్నారన్నారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయ్యాలని కోరుతున్నారు.

జాయింట్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

కొడవలూరు: మండలంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని జేసీ(జాయింట్ కలెక్టర్) వెంకటేశ్వర్లు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజల దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తహసీల్దార్ స్ఫూర్తిరెడ్డికి సూచించారు. సిబ్బంది పనితీరు మెరుగుపరుచుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న జేసీ వెంకటేశ్వర్లు

మద్యం తాగేందుకు నగదు ఇవ్వలేదని..

- ఆటోని తగులబెట్టిన కేసులో ఇద్దరి అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): మద్యం తాగేందుకు నగదు ఇవ్వలేదన్న అక్కసుతో ఆటోను తగులబెట్టిన ఘటనలో ఇద్దరు నిందితులను మంగళవారం నవాబుపేట పోలీసులు అరెస్ట్ చేశారు. మౌలానా సాహెబ్ వీధిలో ఆటో డ్రైవర్ వినయ్ నివాసముంటున్నాడు. ఈనెల 21వ తేదీ రాత్రి వినయ్‌ను మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని నెల్లూరు రూరల్ మండలం సుబహాన్‌నగర్‌కు చెందిన డేవిడ్, శెట్టిగుంటరోడ్డుకు చెందిన సతీష్ అడిగారు. అతను లేవని చెప్పడంతో వారు కోపం పెంచుకున్నారు. 22వ తేదీ తెల్లవారుజామున వినయ్ ఆటోపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. బాధితుడు నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు మంగళవారం నిందితులను అరెస్ట్ చేశారు.



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

సీహెచ్‌సీలో మెగా వైద్యశిబిరం నేడు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం మెగా వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పద్మజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వస్థ్ నారీ.. సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా నిర్వహించే శిబిరంలో మహిళలు, కిశోర బాలికలకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామని వివరించారు. వీటితో పాటు రక్తహీనత, క్షయ, రక్తపోటు, మధుమేహం, చర్మ, దంత, చెవి, ముక్కు, గొంతు సమస్యలకు సంబంధించి ప్రత్యేక వైద్యసేవలు అందిస్తామని పేర్కొన్నారు. బుచ్చిరెడ్డిపాళెం పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రో టెక్నాలజీతో అధిక లాభాలు

మనుబోలు: వ్యవసాయంలో ప్రో టెక్నాలజీ ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు గడించవచ్చని మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణయ్య తెలిపారు. ఆయన స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని సాగు చేస్తే ఖర్చులు తగ్గి తద్వారా అధిక లాభాలు వస్తాయన్నారు. పురుగు మందులను పిచికారీ చేసేందుకు గతంలో మండలంలోని కొమ్మలపూడిలో డ్రోన్ అందజేశామని, ఇప్పుడు పిడూరు, ఎల్‌ఎస్‌పురం గ్రామాలకు కూడా డ్రోన్‌లు మంజూరు చేసినట్లు తెలిపారు. వీటిని త్వరలోనే రైతులకు అందజేస్తామని తెలిపారు.

నేడు పడుగుపాడులో విద్యుత్ సరఫరాకు అంతరాయం

కోవూరు: మండలంలోని పడుగుపాడులో రోడ్డు విస్తరణ పనుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఆశాఖ ఏఈ గిరిధర్ మంగళవారం తెలిపారు. పెద్ద పడుగుపాడు, చంద్రమౌళి సంగం, శ్రీనివాసనగర్, ఇనమడుగు సెంటర్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయాలు ఉంటాయని, వినియోగదారులు సహకరించాలని తెలిపారు.

వీఎస్‌యూ విద్యార్థి సంక్షేమ డీన్‌గా డాక్టర్ ప్రభాకర్ నియామకం



నియామక పత్రాలు అందుకుంటున్న డాక్టర్ ఆర్.ప్రభాకర్

వెంకటాచలం: విక్రమసింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ)లో విద్యార్థి సంక్షేమ విభాగం డీన్‌గా డాక్టర్ ఆర్.ప్రభాకర్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన వీఎస్‌యూ కళాశాలలో ఇంగ్లిష్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా సేవలందిస్తుండగా, విద్యార్థి సంక్షేమ డీన్‌గా నియమిస్తూ వీసీ అల్లం శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు.

విజయమ్మ ఆత్మహత్యాయత్నం బాధాకరం



విజయమ్మను పరామర్శిస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి తదితరులు

- ఇది సోమిరెడ్డి అరాచకాలకు పరాకాష్ట
- కేసును నీరుగారిస్తే పోలీసులకు ఇబ్బందులు తప్పవు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(అర్బన్): సర్వేపల్లి నియోజకవర్గం ముత్తుకూరు మండలం దొరువులపాళెం గ్రామానికి చెందిన విజయమ్మ ఆత్మహత్యాయత్నం బాధాకరమని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. నెల్లూరులోని ప్రభుత్వ పెద్దాస్పత్రిలో చికిత్స పొందుతున్న విజయమ్మను మంగళవారం రాత్రి గోవర్ధన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ వైఎస్ రాజశేఖరరెడ్డి మరణాన్ని తట్టుకోలేక విజయమ్మ భర్త మృతిచెందాడన్నారు. దీంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఓదార్పు యాత్రలో ఆమె ఇంటికెళ్లి పరామర్శించినట్లు చెప్పారు. అప్పటి నుంచి ఆ దళిత కుటుంబానికి చెందిన విజయమ్మ వైఎస్సార్‌సీపీపై అభిమానంతో కార్యకర్తగా ఉందన్నారు. దొరువులపాళేనికి చెందిన సునీత వీఓఏగా పనిచేస్తూ పొదుపు మహిళలకు చెందిన రూ.18 లక్షలు స్వాహా చేసిందన్నారు. ఈ విషయాన్ని విజయమ్మ వెలుగులోకి తీసుకొచ్చి కలెక్టర్, అధికారులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. విచారించిన అధికారులు ఆమెను వీఓఏగా తొలగించారన్నారు. ఖాళీగా ఉన్న ఆ పోస్టులో విజయమ్మ కోడలు కోటేశ్వరమ్మను నియమించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మళ్లీ విచారణ చేయగా సునీత నిధుల దుర్వినియోగం చేసిందని మరోసారి నిరూపితమైందన్నారు. అయినా కూడా సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అధికారుల ద్వారా వీఓఏను తొలగించారన్నారు. నిధులు స్వాహా చేసిన వారిని మళ్లీ ఆ పోస్టులో నియమించుకున్నారన్నారు. దీనిని ప్రశ్నించినందుకు టీడీపీ నేతలు విజయమ్మను టార్గెట్ చేశారన్నారు. ఆమె సెల్ఫీ వీడియో తీసుకుని నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందన్నారు. పోలీసులు ఈ కేసును నీరు గారిస్తే సహించేది లేదన్నారు. వీడియో సాక్ష్యంగా ఉందన్నారు. భవిష్యత్‌లో పోలీసులు ఇబ్బందులు పడుతారన్నారు. తాము కూడా వారిపై ప్రైవేట్ కేసులు వేస్తామని హెచ్చరించారు. సోమిరెడ్డి ఎమ్మెల్యే అయ్యాక వీఓఏలు, డీలర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లను వేధించడం, సర్పంచ్‌ల చెక్‌పవర్ రద్దు చేయిస్తూ ఇబ్బందులు పెడుతున్నాడన్నారు. అక్రమాలను అడ్డుకుని తీరతామన్నారు. ఆమె కుటుంబానికి అండగా ఉండి కాపాడుకుంటామన్నారు. బాధితురాలి కోడలు కోటేశ్వరమ్మ మాట్లాడుతూ తమ కుటుంబంపై విక్రమ్‌రెడ్డి అనే వ్యక్తి పగబట్టాడని ఆయన సోమిరెడ్డి ఒత్తిడితో వేధిస్తున్నారని ఆవేదన చెందారు. పొదుపులో తినేసిన డబ్బులు గురించి ప్రశ్నించడమే నేరమైందని, అందుకే తమను హింసిస్తున్నారన్నారు.

మహిళలు ఆరోగ్య నియమాలు పాటించాలి

వెంకటాచలం: మహిళలు తప్పనిసరిగా ఆరోగ్య నియమాలు పాటించాలని కసుమూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ ప్రవల్లిక సూచించారు. మండలంలోని కసుమూరు పీహెచ్‌సీలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు తప్పక పౌష్టికాహారం తీసుకోవాలని చెప్పారు. ఆరోగ్య నియమాలు పాటిస్తూ, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంటి పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేసుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా మహిళలకు పలు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ పి.ప్రణవి, డాక్టర్ లక్ష్మమ్మ, ఐసీడీఎస్ సీడీపీఓ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ ప్రవల్లిక

రక్తదాన శిబిరం ప్రారంభం

కొడవలూరు: మండలంలోని రాజుపాళెంలో ఉన్న శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజుల రక్తదాన శిబిరాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాస్‌కుమార్ మాట్లాడుతూ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్, హెచ్‌డీఎఫ్‌సీ, రెడ్‌క్రాస్ సహకారంతో నిర్వహిస్తున్న శిబిరంలో తొలిరోజు 205 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు రక్తదానం చేశారని వివరించారు. ఎస్వీ గ్రూప్ విద్యాసంస్థల చైర్మన్ పి.గుణశేఖర్ మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్ రవికుమార్, ఏఓ గిరీష్‌కుమార్, ఏపీఓ ఫణికుమార్, ఎన్‌సీసీ ఆఫీసర్ సతీష్, పీడీ బాలు, రెడ్‌క్రాస్ ఆఫీసర్ వరప్రసాద్, హెచ్‌డీఎఫ్‌సీ నెల్లూరు సిటీ హెడ్ వీరభద్రరావు సిబ్బంది పాల్గొన్నారు.



పొదుపు మహిళలు ఆర్థికంగా ఎదగాలి

- డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి

పొదలకూరు: పొదుపు మహిళలు ఆర్థికంగా ఎదిగి కుటుంబాలకు ఆసరాగా నిలవాలని డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి అన్నారు. మండలంలోని అయ్యగారిపాళెంలో మన డబ్బులు–మన లెక్కలు కార్యక్రమంలో భాగంగా గ్రామాన్ని మంగళవారం సందర్శించి సంఘ లెక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అయ్యగారిపాళెం గ్రామాన్ని మోడల్‌గా ఎంపిక చేసినట్టు తెలిపారు. మన లెక్కలపై సభ్యులకు అవగాహన కల్పించడంతో పాటు ఉమెన్ లీడ్ ఎంటర్‌ప్రైజెస్, కిచెన్ గార్డెన్, పెరటికోళ్ల పెంపకం, లఖ్‌పతి దీదీ హుడ్స్‌పై పీడీ మాట్లాడారు. పొదుపు సంఘాల ద్వారా అనేక రకాల రుణాలు పొందేందుకు అవకాశం ఉందన్నారు. మహిళలు రుణాలు తీసుకుని బ్యాంకులకు సక్రమంగా చెల్లించి ఆర్థికంగా నిలదొక్కుకోవాల్సిందిగా సూచించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. లక్ష్మీ అనే సభ్యురాలి పిండిమిల్లును సందర్శించారు. పీడీ వెంట వెలుగు ఏపీఎం చిన్నయ్య తదితరులు ఉన్నారు.



అయ్యగారిపాళెంలో మహిళలతో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ

డీలర్ల సమయపాలన తప్పనిసరి

కొడవలూరు: రేషన్ డీలర్లు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని తహసీల్దార్ స్ఫూర్తిరెడ్డి అన్నారు. మండల కార్యాలయంలో మంగళవారం రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సీఎఫ్‌ఎం ఐడీలు క్రియేట్ చేసేందుకు డీలర్లు ఆధార్, బ్యాంక్ పాస్‌బుక్ జెరాక్స్ అందించాలని సూచించారు. కార్యక్రమంలో డీటీ సారంగపాణి, ఆర్‌ఐ హైమావతి, సీఎస్ డీటీ బాలకోటమ్మ, వివిధ గ్రామాల రేషన్‌షాపుల నిర్వాహకులు పాల్గొన్నారు.



రేషన్ డీలర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్

అరుణ విచారణ పూర్తి

కోవూరు: గిరిజనులను మోసగించిన కేసులో నిడిగుంట అరుణ రెండు రోజుల పోలీస్ కస్టడీ మంగళవారంతో పూర్తయింది. వివరాలు ఇలా ఉన్నాయి. పడుగుపాడు గ్రామానికి చెందిన అరుణ, నాగలకట్ట గిరిజనులకు ఇళ్ల పట్టాలు ఇప్పిస్తామని నమ్మబలికి సుమారు 21 కుటుంబాల నుంచి రూ.10 వేల చొప్పున మొత్తం రూ.2.10 లక్షలు వసూలు చేసిందని స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేసి ఉన్నారు. దీనిపై జరిపిన విచారణలో పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. సీఐలు నాగేశ్వరమ్మ, సుధాకర్‌రెడ్డి విచారించి స్పష్టమైన వివరాలు రికార్డు చేసినట్లు తెలిసింది. విచారణ అనంతరం అరుణను వైద్య పరీక్షలకు తరలించి, మళ్లీ నెల్లూరు జైలులో ఉంచినట్లు పోలీసులు వెల్లడించారు.



పోలీస్‌స్టేషన్ నుంచి బయటకు వస్తున్న అరుణ